
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 26 ఆగస్టు 2025





వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రిజిస్ట్రేషన్ కార్యాలయం తరలకుండా చర్యలు

» భువనగిరి ఎంపీ చామల, ఎమ్మెల్యే మల్‌రెడ్డి

యాచారం/ఇబ్రహీంపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం తరలిపోకుండా బొంగులూర్ సమీపంలోని ఔటర్ రింగు రోడ్డు వద్ద కొత్త భవనం నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. సోమవారం యాచారం, ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం ప్రభుత్వాసుపత్రిల్లో వాటర్‌ప్లాంట్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో రెండు వాటర్ ప్లాంట్లను రూ.7లక్షలతో ఏర్పాటు చేయించామని చెప్పారు. ఇటీవలే ప్రభుత్వాసుపత్రిని రూ.50లక్షల నిధులతో మరమ్మతు చేయించామన్నారు. యాచారం ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమాలలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, మస్కు నర్సింహ, అక్బర్, బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్‌రెడ్డి, మెటీ శ్రీశైలం, నాయిని సుదర్శన్‌రెడ్డి, అమృత సాగర్, సుధామాధవి, సరిత, ప్రియాంక, లలిత, ఉమ, నవీన్‌కుమార్ ఉన్నారు.



ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. మొత్తం 74 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పాల్గొన్నారు.

న్యాయం చేయాలని భూబాధితుల ధర్నా

ఫరూక్‌నగర్ మండలం సోలిపూర్ గ్రామానికి చెందిన భూ బాధితులు న్యాయం చేయాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆందోళనకు దిగారు. సుప్రీం బిల్డర్ వారు అధికారుల అండదండలతో రెచ్చిపోతున్నారని, జాయింట్ కలెక్టర్ నుంచి

మిగతా 8వ పేజీలో...

గణేశ్ మండపాలపై పకడ్బందీ నిఘా

» రాచకొండ సీపీ సుధీర్‌బాబు

» ఆదిభట్ల పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

ఆదిభట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాలపై పోలీసుల నిఘా పకడ్బందీగా ఉండాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఆదిభట్ల పోలీసు స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసే మండపాల వివరాలను సీఐ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు పోలీసు, విద్యుత్ శాఖ అనుమతులు తప్పని సరిగా తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. నిమజ్జనం జరిగే చెరువుల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుతో ఫ్రెండ్లీగా వ్యవహరించి, సమస్యలను పరిష్కరించాలన్నారు. మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ రవికుమార్, ఎస్సైలు వెంకటేష్, నోయెల్‌రాజు, సత్యనారాయణ, సైదయ్య పాల్గొన్నారు.



మొయినాబాద్ : హిమాయత్ నగర్‌లో కొనసాగుతున్న మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణ పనులు

శుద్ధ జలమే లక్ష్యం!

జంట జలాశయాలు హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్‌లలో మురుగు నీరు చేరకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందుకోసం ఎస్టీపీల (సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు) నిర్మాణాలను చేపట్టాలని కీలక నిర్ణయించింది. రూ.82.23 కోట్ల ఖర్చుతో ఈసీ, మూసీ పరివాహక ప్రాంతాల్లో ఈ ప్లాంట్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అవి వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో జలమండలి అధికారులు ముందుకు సాగుతున్నారు. ఎస్టీపీల నిర్మాణం పూర్తయితే భవిష్యత్ తరాలకు మురుగు బెడద తొలగిపోనుంది.

ప్రభుత్వం నిర్ణయం భేష్



జంట జలాశయాల్లో మురుగు నీరు చేరకుండా ప్రభుత్వం మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటం గొప్ప విషయం. వీటి ద్వారా గండిపేట, హిమాయత్‌సాగర్‌లోకి మురుగు చేరకుండా అరికట్టవచ్చు. భవిష్యత్ తరాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

కీసరి సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు

మురుగు నీటి శుద్ధికి ఎస్టీపీల నిర్మాణం

- జంట జలాశయాల ఎగువన నాలుగు కేంద్రాలు
- రూ.82.23 కోట్లతో శరవేగంగా పనులు
- వచ్చే ఏడాది మార్చి వరకు పూర్తికి చర్యలు



శంకర్‌పల్లి మండలం జన్వాడ వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణ పనులు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించే జంట జలాశయాలు హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట)లను మురుగు ముప్పు వెంటాడుతోంది. ఈ ప్రాజెక్టుల ఎగువన ఉన్న గ్రామాల నుంచి భారీగా మురుగు వచ్చి చేరుతోంది. దీంతో రిజర్వాయర్లు కలుషితమయంగా మారాయి. నిత్యం గండిపేట జలాశయంలోకి 29 లక్షల లీటర్లు, హిమాయత్ సాగర్‌లోకి 43.5 లక్షల లీటర్ల వ్యర్థ జలాలు కలుస్తున్నట్లు జల మండలి పరిశీలనలో వెల్లడైంది. దీనిని అరికట్టేందుకు హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డు ఆధ్వర్యంలో ఔటర్ రింగు రోడ్డుకు సమీపంలో జలాశయాలకు బ్యాక్‌సైడ్ ఉన్న ప్రాంతాల్లో నాలుగు ఎస్టీపీల (సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు) నిర్మాణాలను చేపట్టాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.82.23 కోట్లు ఖర్చు చేయనుంది. 2050 వరకు ఉత్పన్నమయ్యే మురుగును అంచనా వేసి రూపొందించిన ఈ ప్లాంట్‌ల నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైంది. ప్రస్తుతం వాటి పనులు ఊపందుకున్నాయి. చేవెళ్ల అసెంబ్లీ నియోజకర్గం లోని జన్వాడ, హిమాయత్‌నగర్, నాగిరెడ్డి గూడ వద్ద పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జంట జలాశయాల ఎగువ ప్రాంతాల్లో ఫామ్‌హౌస్‌లు, విల్లాలు, ఇళ్లు, పరిశ్రమలు, విద్యాసంస్థలు,

మిగతా 8వ పేజీలో...

కోడ్ రాకముందే అభివృద్ధి చేసుకుందాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 7

కమీషన్ డబ్బులు వెంటనే ఇవ్వాలి

జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ 7

ఇదేం నిర్లక్ష్యం..!

జనావాసాల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు



చర్లపటేల్‌గూడలో ఇళ్ల మధ్యనే ట్రాన్స్‌ఫార్మర్

- ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో ప్రజలు

ఆదిభట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇళ్ల మధ్య, రోడ్ల పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు భయపెడుతున్నాయి. అలాగే ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలకు యమపాశాలుగా మారుతున్నాయి. రక్షణ కంచెలు లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరిగి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రజలు కూడా వాటి దగ్గరికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. రోడ్లపక్కన, ఇళ్ల మధ్యన, పాఠశాలల వద్ద తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ కంచెలు లేకుండా ఉన్నాయి. అలాగే ఇళ్లపై నుంచి విద్యుత్‌తీగలు పోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆదిభట్ల మండల పరిధిలోని చర్లపటేల్‌గూడలో శేరిగూడ అక్కమ్మ, దుంపల బద్రీ ఇంటి సమీపంలో ఎలాంటి రక్షణ వలయం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. ఎలిమినేడులో ఎస్సీ బస్తీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మిగతా 8వ పేజీలో...

ఎవరూ పట్టించుకోవడం లేదు

ఇళ్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులకు,



అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మా ఇంటి పక్కనే రక్షణ కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఆ పక్కనే మా పిల్లలు ఆడుకుంటుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరగుతుందో తెలియడం లేదు. కరెంట్ అధికారులు పట్టించుకొని ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి.

- దుంపల బద్రి, చర్లపటేల్‌గూడ గ్రామస్తుడు



రైతులతో సమావేశమైన ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

మా భూములు ఇచ్చేది లేదు

» ప్రభుత్వానికి తేల్చి చెప్పిన తిమ్మాపురం రైతులు

కందుకూరు, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వానికి ఇచ్చేది లేదని తిమ్మాపురం గ్రామ రైతులు స్పష్టం చేశారు. సోమవారం తహసీల్దార్ కె.గోపాల్ ఆధ్వర్యంలో గ్రామంలో భూసేకరణ కోసం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. తిమ్మాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 38లో 350ఎకరాలు, 162 సర్వే నెంబర్‌లో 216ఎకరాల 39గుంటల అసైన్డ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం టీజీఐఐసీ ద్వారా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు భూసేకరణ చేపట్టనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ భూములకు ప్రభుత్వ మార్కెట్ ప్రకారం ఎకరాకు రూ.19లక్షలు ఉందని, 2013చట్టం ప్రకారం ఎకరాకు మూడు రెట్లు (రూ.59లక్షల 40వేలు)అధికంగా రైతులకు పరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. అయితే, పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వానికి ఇచ్చేది లేదని తిమ్మాపురం రైతులు స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అసైన్డ్ భూములను పట్టాలుగా మార్చి న్యాయం చేయాలని కోరారు. రైతుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. రెండు సర్వే నెంబర్లలో భూసేకరణ కోసం ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడిందని, రెండురోజుల్లో ఎంజాయ్‌మెంట్ రిపోర్టును పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్డీవో తెలిపారు. సమావేశంలో సీఐ సీతారాం, డిప్యూటీ తహసీల్దార్ రాజు, ఆర్ఐ యాదగిరి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అజీజ్ సుల్తానా పాల్గొన్నారు.

కొర్వి బాలకృష్ణకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న కొర్వి బాలకృష్ణ

కందుకూరు, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కొర్వి బాలకృష్ణ ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్‌ను అందుకున్నారు. ఇంగ్లీష్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తూ పరిశోధన గ్రంథం తెలంగాణ హన్‌సంగ్‌పై రాణించారు. దీంతో సోమవారం ఇస్రో చైర్మన్ వి.నారాయణ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు కుటుంబంలో జన్మించిన తాను ఎన్నో ఒడిదుడుకులను అధిగమిస్తూ నేడు డాక్టరేట్‌ను అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

చిలుకూరు ఆలయంలో గౌరి లక్ష్మీబాయి పూజలు



రంగరాజన్‌తో పద్మశ్రీ అవార్డు గ్రహీత గౌరి లక్ష్మీబాయి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు25 (ఆంధ్యజ్యోతి): మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయాన్ని పద్మశ్రీ అవార్డు గ్రహీత గౌరి లక్ష్మీబాయి దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం ఆలయానికి ఆమె కుటుంబసమేతంగా వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ ఆలయ విశిష్టతను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా కేరళలోని ప్రసిద్ధ క్షేత్రం తిరువనంతపురం చరిత్ర, పద్మనాభస్వామి ఆలయ తదితర అంశాలపై ఆమె చేసిన రచనల విశేషలను రంగరాజన్‌కు వివరించారు. చిలుకూరు బాలాజీ అర్చక ట్రస్టీ కుటుంబానికి తిరువనంతపురం పద్మనాభదాస రాజవంశానికి మధ్య ఉన్న అధ్యాత్మిక సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు చిలుకూరు బాలాజీకి సంబంధించిన వాక్ పుస్తకాన్ని అందజేశారు.

యూరియా కోసం రైతుల బారులు

షాబాద్/ఇబ్రహీంపట్నం కేశంపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): షాబాద్ మండలంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం షాబాద్‌లో పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం బారులుదీరారు. మండలానికి 450 బస్తాలు మాత్రమే రావడంతో ఒక రైతుకు రెండు బస్తాల యూరియా మాత్రమే ఇస్తున్నారు. దీంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.



షాబాద్‌లో యూరియా కోసం బారులుదీరిన రైతులు

మొరాయించిన ఈ-పాస్ మిషన్

ఇబ్రహీంపట్నం మండల పరిధి ఉప్పరిగూడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రం వద్ద ఈ-పాస్ మిషన్ పనిచేయకపోవడంతో రైతులు యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. మిషన్ ఆన్ అయినా కొందరికీ యూరి అందకపోవడంతో నిరాశగా వెనుదిరిగిపోయారు. ఈ విసయమై మండల వ్యవసాయాధికారి విద్యాధరి మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో 40 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఇప్పటికే అవసరం మేరకు 760 మెట్రిక్ టన్నుల యూరియా అందించామన్నారు. యూరియా కొరత వదంతులను నమ్మొద్దన్నారు.

కేశంపేట మండలంలో...

కేశంపేట మండలంలో యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. సోమవారం కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి 450 బస్తాల యూరియా వచ్చింది. రెండు యూరియా బస్తాలు తీసుకోవడానికి రైతులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

పరిహారం ఇచ్చి ఆదుకోండి


చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం వద్ద బాధితులు

చేవెళ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేవెళ్లలో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుతో ప్లాట్లు కోల్పోతున్న తమకు పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని బాధితులు సోమవారం ఆర్డీవో కార్యాలయ ప్రజావాణిలో వినతిపత్రమిచ్చారు. నిర్వాసితులు మాట్లాడుతూ.. 2016లో చేవెళ్ల వెంచర్‌లో ప్లాట్లు కొనగా బీజాపూర్ హైవేకు ప్లాట్లు సేకరిస్తూ పరిహారం ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, బస్వరాజ్, సందీప్‌కుమార్, వేణు, సుదర్శన్‌రెడ్డి, శివకుమార్, రాజేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మణ్, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

శామీర్‌పేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రవేశపెడుతున్న పథకాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) కార్పొరేట్ విభాగ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం అలియాబాద్‌లోని ఎస్పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆర్బీఐ ఏజీఎం రెహ్మాన్, సీబీఐ అలియాబాద్ బీఎం మాధురి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై డ్వాక్రా మహిళలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కుటుంబంలోని సభ్యులంతా బ్యాంక్ ఖాతాలు తెరిచి వాటిల్లో డబ్బులు జమచేస్తుండాలన్నారు. ఏదైనా బ్యాంక్‌లో ప్రతి ఒక్కరు తమ ఖాతా రీ-కేవైసీని తప్పక చేయించుకోవాలని సూచించారు. బ్యాంక్ అకౌంట్‌లో మినిమం డిపాజిట్ రూ.256 ఉంచుకోవాలని, ఆ డబ్బుతో బీమా వర్తిస్తుందన్నారు. ఎల్‌డీఎం శివప్రసాద్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై వివరించారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి సైబర్ నేరాలపై వివరించారు. అనంతరం అధికారులు డ్వాక్రా గ్రూపులకు రూ.5.36కోట్ల రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సీబీఐ హైదరాబాద్ జోనల్ హెడ్ దారాసింగ్‌నాయక్, రీజినల్ హెడ్ దిలీప్‌కుమార్, బన్వర్‌లాల్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ ఉమాజానకి, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించే యోచనను మానుకోండి


ఇబ్రహీంపట్నంలో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటు పేరిట ఇబ్రహీంపట్నంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంఖాల్‌కు తరలించే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సోమవారం ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉన్న కార్యాలయాన్ని మరోచోటికి తరలిస్తే ప్రజలకు ఇబ్బంది అవుతుందన్నారు. కార్యాలయాలు ప్రజలకు చేరువగా ఉండాలి గానీ దూరంచేస్తే ఊరుకోం అని హెచ్చరించారు. పాత బస్టాండ్ వద్ద అర్ధాంతరంగా నిలిపివేసిన భవనాన్ని పూర్తి చేసి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అందులోకి మార్చాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీజేపీ మండల అధ్యక్షుడు ముత్యాల మహేందర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, టేకుల రాంరెడ్డి, రాఘవేందర్, విజయ్‌కుమార్, సందీప్, అనిల్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ తరలింపు ప్రయత్నాన్ని విరమించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన అంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవ తీసుకుని కార్యాలయ తరలింపును అడ్డుకోవాలని కోరారు. నిరసనలో నాయకులు బుగ్గరాములు, జగన్, ఎల్లేష్, కృష్ణ, స్వప్న, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు. ప్రజావాణిలోనూ పలువురు విజ్ఞాపన పత్రాలు అందజేశారు.

షాద్‌నగర్‌ను క్రీడా కేంద్రంగా మార్చేందుకు కృషి

● ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


క్రీడాకారులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గాన్ని క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో పలువురు క్రీడాకారులకు ప్రోత్సాహకంగా రూ.3లక్షల నగదును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులతో రాణించాలేక పోతున్నారని చెప్పారు. విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు తన వంతు ఆర్థిక సహకారం అందిస్తానని తెలిపారు. త్వరలో క్రీడా ప్రణాళిక రూపొందిస్తామని, షాద్‌నగర్ నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తయారీకి కృషిచేస్తానన్నారు. క్రికెట్ కిట్ల కోసం షాద్‌నగర్ క్రికెట్ అసోషియేషన్ నిర్వాహకులు కబీర్‌కు రూ.లక్ష, చెస్, వాలీబాల్ అసోషియేషన్లకు రూ.50వేలను అందజేశారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలి


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న విజయ్‌కుమార్, వరప్రసాద్‌రెడ్డి

కీసర, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నూతన సాకేంతికతతో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జేఎన్టీయూ రెక్టార్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నాగారం పరిధి భోగారం హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు దేశానికి దోహదపడేలా ఉపాధి పొందాలన్నారు. వ్యసనాలకు బానిస కాకుండా, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కళాశాల అటనమస్‌గా ఏర్పడిన ఆనంతరం మొదటి బ్యాచ్‌లో అధిక సంఖ్యలో ఉతీర్ణత సాధించారని కళాశాల ఫౌండర్ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆనంతరం విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ సెక్రటరీ విజయశారదరెడ్డి, చైర్మన్ సిద్ధార్థరెడ్డి, విభాగాల హెచ్‌ఓడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


వైద్యాధికారికి వినతి పత్రం ఇస్తున్న బాల్‌రాజ్, ఆశా కార్యకర్తలు

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆశాలతో కలిసి వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని అమలు చేసి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు శ్రీలత, జయసుధ, అండాలు, ముంతాజ్ బేగం, అనిత, రజిత, మంజుల, మాధవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆమనగల్లు విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ బెల్టులు సాధించారు. హైదరాబాద్ యూసుఫ్ గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఆమనగల్లుకు చెందిన జగదీశ్వర్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. ఏడుగురు గోల్డ్, ఇద్దరు సిల్వర్ మెడల్స్ సాధించారు. వారిని మాస్టర్ జగదీశ్వర్, నాయకులు సత్కరించారు.


మెడల్స్ సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్ జగదీశ్వర్



నివాళులర్పిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి

గుండెపోటుతో యువకుడి మృతి

మంచాల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన నూకం జంగయ్య(35) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యుడైన నూకం జంగయ్య ఇటీవల పాఠశాల అభ్యున్నతికి నిరంతరం శ్రమించాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, జానీపాషా, కంబాలపల్లి భాస్కర్, నూకం రాజు, గుడ్డిమల్ల చంద్రయ్య తదితరులు నూకం జంగయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేయాలని ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) ఖుష్రుషా ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన వికారాబాద్ ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్యారేజ్, స్టోర్స్, టైర్, ఆయిల్, వాషింగ్, ట్రాఫిక్, చార్ట్ డ్యూటీ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి పనితీరుపై ఆరా తీశారు. ఏయే మార్గాల్లో ఎంతెంత ఆదాయం వస్తోందే వివరాలను డిపో మేనేజర్ నర్మదను అడిగి తెలుసుకున్నారు. తీర్థయాత్రలు, శుభ కార్యాలు, విహార యాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్న విషయం ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. వికారాబాద్ డిపో పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన ఆదాయం, సేవలు పెంపొందించుకునేందుకు అనుసరించాల్సిన మార్గాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఎం వీఎస్ శ్రీనివాస్, డిపో మేనేజర్ నర్మద, ఎంఎఫ్ సురేందర్, చార్ట్ డ్యూటీ కంట్రోలర్లు, భద్రతా విభాగం అధికారి అనంతగిరిపల్లి నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

నూనె గింజల సాగు లాభదాయకం

తలకొండపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నూనె గింజల పంటల సాగు రైతులకు లాభదాయకమని ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి అన్నారు. తలకొండపల్లి మండలం రాంపూర్ రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ, రాంపూర్‌రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నూనె గింజల మిషన్ సహకారంతో వేరుశనగ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో రేణుకచక్రవర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఏడీఏ హాజరై మాట్లాడారు. జాతీయ నూనె గింజల మిషన్ వేరుశనగ పథకం కింద మండల పరిధిలో 535 మంది రైతులను ఎంపిక చేసి వెయ్యి ఎకరాల్లో వేరుశనగ సాగు చేయనున్నట్లు తెలిపారు. రైతులు వేరుశనగ సాగుకు సెప్టెంబర్ 20 వరకు పొలాలను సిద్ధం చేసుకోవాలన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

కడ్తాల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మక్తమాదారం నుంచి నేదునూరు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా నాయకుడు నింగ్యారి యాదగిరి, గ్రామ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కోరారు. సోమవారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

చేవెళ్ల/మొయినాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ ఆరోపించారు. సోమవారం చేవెళ్లలో ఏబీవీపీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి హారిక, నాయకులు ఆకాశ్, హరికృష్ణ, మణిదీప్ ఉన్నారు. మొయినాబాద్‌లో నగర కార్యదర్శి బట్టు విజయకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు.

రూ.9కోట్లతో ఉపాధి పనులు

కోట్‌పల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో 2024, 2025, ఆర్థిక సంవత్సరానికి రూ.9కోట్లతో ఉపాధి హామీ పనులు చేశామని డీఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. పనులపై పది రోజులు 18 పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. సోమవారం కోట్‌పల్లి మండల పరిషత్ ఆవరణలో నిర్వహించిన ప్రజావేదికలో డీఆర్డీవో మాట్లాడారు. ఉపాధి కింద చేసిన ఖర్చులో ప్రతీ రూపాయికి లెక్క ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి ఉపాధి పొందే వారుంటే అలాంటి వారి జాబ్ కార్డును రద్దు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీడీవో డేనియల్, అంబుడ్స్‌మన్ రాములు, ఏపీవో ఎలీష, ఎస్ఆర్‌పీ ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలి

వికారాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలని తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతగిరి హక్స్ టీ-షర్ట్ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. అనంతగిరి హక్స్ జట్టు తెలంగాణ యువ సిరీస్ చాంపియన్‌షిప్ జట్టుగా జిల్లాకు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమన్నారు. వారం రోజులుగా జిల్లా అధ్యక్షుడు పరశురాంనాయక్, జిల్లా కార్యదర్శి వినోద్‌కుమార్, ఎన్‌కేఎస్ టీం ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించారన్నారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు ఎల్బీ స్టేడియంలో జరిగే తెలంగాణ యువ సిరీస్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.

ముగిసిన స్వాతి అంత్యక్రియలు



అంబులెన్స్‌లో స్వాతి మృతదేహం

వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో దారుణహత్యకు గురైన స్వాతి మృతదేహానికి కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య సోమవారం రాత్రి అంత్యక్రియలు జరిగాయి. హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో స్వాతి మృతదేహం రాత్రి 10.30గంటలకు చేరుకుంది. స్వాతి తల్లి, తండ్రి, సోదరి రోదనలు మిన్నంటాయి. గ్రామ శ్మశానవాటికలో స్వాతి మృతదేహానికి తండ్రి రాములు చితి పెట్టాడు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులను మోహరించారు. పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించారు.

మనిషి కాదు... రాక్షసుడు

ప్రేమించి పెళ్లాడిన స్వాతి గర్భిణి అని కూడా చూడకుండా భర్త మహేందర్‌రెడ్డి హత్య చేయడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోయారు. హంతకుడు రాక్షసుడిగా వ్యవహరించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళ్లు, చేతులు, మొండెం నరకడం హేయం అన్నారు. భార్యను కిరాతంగా హతమార్చి గ్రామానికి మాయని మచ్చ తెచ్చాడని మండిపడ్డారు.

కమీషన్ డబ్బులు వెంటనే ఇవ్వాలి

- జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్
- డీఎస్‌వోకు వినతిపత్రం అందజేత



డీఎస్‌వోకు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు రావాల్సిన ఐదు నెలల కమీషన్ డబ్బులను వెంటనే చెల్లించాలని జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఎస్‌వోకు వినతిపత్రం ఇచ్చారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కమీషన్ రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో డీలర్లకు రూ.5వేల గౌరవవేతనం ఇస్తామని, కమీషన్ సైతం పెంచుతామని ప్రకటించారని, మాట నిలబెట్టుకోవాలన్నారు. డీలర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపులను వచ్చే నెలా 5న బంద్ పాటిస్తామని తెలిపారు. రేషన్ షాపుల్లో మరిన్ని నిత్యావసర సరుకులను పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డీలర్ల సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ వై.భానుచందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సి.సత్తయ్య, సత్యనారాయణ, కోశాధికారి శివకుమార్ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట డీలర్ల నిరసన

వికారాబాద్: రేషన్ డీలర్లకు బకాయిపడ్డ కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని డీలర్ల సంఘం అధ్యక్షుడు జూకారెడ్డి ఆధ్వర్యంలో వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా పంపిణీ చేశామన్నారు. కానీ తమకు కమీషన్ నెలల తరబడి చెల్లించకపోవడం దారుణమన్నారు. దుకాణాల అద్దె, విద్యుత్ చార్జీలు, ఇతర ఖర్చులతో అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా కాకుండా పాతపద్ధతి ప్రకారమే కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీలర్ల వద్ద ఉన్న దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం రికవరీ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల డీలర్లు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో జిల్లా బీసీ నేతలు

వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్రం నుంచి అఖిలపక్ష నేతలను ఢిల్లీకి తీసుకువెళ్లాలని ప్రముఖ న్యాయవాది, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో జిల్లాకు చెందిన బీఆర్ కృష్ణతో పాటు తాండూరు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ రాకముందే అభివృద్ధి చేసుకుందాం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొత్తూర్-జేపీ దర్గా రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్, అధికారులు

కొత్తూర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ రాక ముందే కొత్తూర్ మునిసిపాలిటీలో అభివృద్ధి పనులను చేసుకుందామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బీటీ, సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను అధికారులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం సమీక్ష నిర్వహించారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌కు ముందే మిగిలిన పనులను ప్రారంభించాలని, అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని తెలిపారు. కొత్తూర్ మండల కేంద్రానికి సింగిల్ విండోను మంజూరు చేశామన్నారు. నందిగామ మండలంలో ఉన్న కొత్తూర్ పీహెచ్‌సీని కొత్తూర్‌కు మార్చేలా ఉత్తర్వులొచ్చాయని, ఆస్పత్రి నిర్మాణానికి స్థలసేకరణ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బైపాస్ రోడ్డులో జేపీదర్గా చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని మాజీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. కొన్ని దుష్టశక్తులు ఫ్లైఓవర్ రాకుండా ప్రయత్నిస్తున్నారని, ఎవరెన్ని జిత్తులు వేసినా ఫ్లైఓవర్ నిర్మించి తీరుతామని తేల్చి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, హెచ్ఆర్‌డీసీ ఈఈ క్రాంతి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు హేమదేవేందర్, సోమ్లా నాయక్, నాయకులు బి.దేవేందర్‌యాదవ్, జనార్ధన్‌చారి, నర్సింహ,చంద్రపాల్‌రెడ్డి, ఎమ్మె సత్తయ్య, రాజు, జె.శ్రీను, జగన్, ఇందూరి శ్రీను, కర్రోల్ల సురేందర్, నవీన్‌చారి, ఏనుగు జనార్ధన్‌రెడ్డి, చిలకమర్రి నర్సింహ, గోవింద్‌నాయక్, జగదీశ్వర్‌గౌడ్, భార్గవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలి

- మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డి



లక్ష్మీనారాయణ చెరువు వద్ద సూచనలిస్తున్న డీసీపీ పద్మజారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని మల్కాజ్‌గిరి జోన్ డీసీపీ పద్మజారెడ్డి ఆదేశించారు. సోమవారం ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువును ఆమె సందర్శించి వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. బారికేడ్లు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ చక్రపాణి, సీఐలు ఎం.బాలస్వామి, రాజువర్మ, ఎస్సైలు, డీఇ శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ సతీష్, ఆర్ఐ కావ్య, కె.కుమార్, వేముల రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పించేందుకు కృషిచేయాలని డీసీపీ పద్మజారెడ్డి అన్నారు. ప్రతాప్‌సింగారం జెడ్పీ పాఠశాలలో నిర్మించిన సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, హెచ్ఎం రవికుమార్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: మంగళపల్లిలో కాజ్‌వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

గ్రామాల అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, ఆగసు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గ్రామాల్లో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. మంగళపల్లిలో కాజ్‌వేను, గోవిందాయిపల్లిలో పంచాయతీ భవనాన్ని ఆయన ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ జి.భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, డీఈఈ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. చుక్కాపూర్, మంగళపల్లి, చెన్నకేశవ కాలనీ, గోవిందాయిపల్లి తండా అంగన్‌వాడీ, మక్తమాదారంలో పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవనాలు లేని, శిథిలావస్థకు చేరిన అన్ని పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని తెలిపారు. రోడ్లు లేని అన్ని గ్రామాలు, తండాలకు బీటీ రోడ్లు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు సుజాత, శ్రీకాంత్, రహెమాన్, తహసీల్దార్ ముంతాజ్, సీడీపీవో శాంతిరేఖ, ఏఈలు అభిషేక్, పరమేశ్, సీఐ జానకిరాంరెడ్డి, గంగాధర్, ఏడీఏ శోభారాణి, ఎంపీవోలు లాలయ్య, వినోద, నాయకులు నర్సింహ, రమణారెడ్డి, టి.నారాయణరెడ్డి, రవీందర్, రాము, సులోచనసాయిలు, మంజులచంద్రమౌళి, జి.కేశవులు, వెంకటేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: మక్తమాదారంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కేబుళ్లు కట్!

- ఆర్టీఏ కార్యాలయంలో నిలిచిన సేవలు

నార్సింగ్, ఆగసు 25(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో సోమవారం సేవలు నిలిచిపోయాయి. ఓ పక్క వినాయకచవితి సందర్భంగా అడ్డంగా ఉన్న కేబుళ్లను కట్‌చేసి విగ్రహాలు తరలించగా, మరో పక్క ట్రాన్స్‌కో అధికారులు మణికొండ మర్రిచెట్టు నుంచి హరివిల్లు వరకు ఉన్న కేబుళ్లను కట్ చేశారు. ఇదే రోడ్డుపై ఉన్న ఆర్టీఏ కార్యాలయానికి ఇంటర్నెట్ సేవలు నిలిచాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలాంటి సేవలు కొనసాగలేదు. లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారంతా వెనుదిరిగిపోయారు. 150 మంది వరకు పనులు కోసం కార్యాలయానికి వచ్చారు. వారందరిని మంగళవారం రావాలని అధికారులు సూచించారు.

పొదుపు సంఘం పేరిట రూ.20లక్షలు స్వాహా

- డీఆర్‌డీఏ డీపీఎంలకు మహిళల ఫిర్యాదు



డీపీఎం యాదయ్యకు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

యాచారం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డిఫాల్ట్ అయిన డ్వాక్రా పొదుపు సంఘం నుంచి రూ.20లక్షలు స్వాహా చేసిన ఉదంతం సోమవారం వెలుగులోకొచ్చింది. ఈ సంఘటన వివరాల్లోకి వెళ్తే.. చౌదర్‌పల్లికి చెందిన రోహిణి అనే పేరిట నిర్వహించిన మహిళా సంఘం లావాదేవీలు 2020 నుంచి నిలిచిపోయాయి. గ్రామ పొదుపు సంఘాల నిధులను ఫోర్జరీ సంతకాలతో కాజేసినట్లు ఇటీవల వార్తలు రావడంతో సంఘాల మహిళలు తమ గ్రూప్‌ల వివరాలు ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ నేపథ్యంలో రోహిణి, వెంకటేశ్వర సంఘాల మహిళలు ఎస్‌బీఐలో తమ ఖాతాల వివరాలు తీసుకున్నారు. రోహిణి సంఘం నుంచి 16-10-2024న ఫోర్జరీ సంతకాలతో రూ.20లక్షలు తీసుకున్నట్టు తేలడంతో మహిళలు సోమవారం డీపీఎంలు యాదయ్య, లలితలకు ఫిర్యాదు చేశారు. ఈ మోసం తెలిసి అధికారులు సైతం విస్తుపోయారు. అలాగే వెంకటేశ్వర సంఘం నుంచి కూడా నిధులు డ్రాచేశారని మహిళలు ఫిర్యాదు చేశారు. తమ సంఘాల రికార్డులు ఇవ్వాలని సిబ్బంది, నిర్వాహకులను అడిగినా ఇవ్వడం లేదని సంఘాల మహిళలు చెప్పారు. డబ్బు కాజేసిన వారి నుంచి రికవరీ చేసి చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరారు. తాము గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించిన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

రోడ్డు విస్తరణతో నష్టపోతాం



కలెక్టరేట్ ఎదుట పోలెపల్లి గ్రామస్తులు

దుద్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): 100 ఫీట్ల రోడ్డు విస్తరణతో తాము తీవ్రంగా నష్టపోతామని పోలెపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. 100 ఫీట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో పేద ప్రజలు ఇళ్లు కోల్పోయే పరిస్థితి ఉందని వాపోయారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించుకున్న ఇళ్లు రోడ్డు విస్తరణలో కోల్పోతే తాము రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం వెలుపలి నుంచి బైపాస్‌రోడ్డు వేసేందుకు అవకాశం ఉందని, ఈ ప్రతిపాదనను పరిశీలనలోకి తీసుకోవాలని కోరారు.



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం

మర్పల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం అవుతుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు రాములుయాదవ్ అన్నారు. బిల్కల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సోమవారం ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సురేశ్, బ్లాక్-2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు రవీందర్, ప్రభాకర్, రఫీయోద్దీన్, రాజన్న, సురేశ్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మహేశ్వరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని, స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలను అమలుచేయాలనే డిమాండ్‌తో సోమవారం మహేశ్వరంలో బీజేపీ మండలాధ్యక్షుడు తెల్లమల్ల యాదీశ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి గెలిచేందుకు బీసీ రిజర్వేషన్ బిల్లు పేరిట తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రజలు గమనించాలన్నారు. రెండేళ్లుగా గ్రామాల్లో ఒక్కపనీ కాలేదన్నారు. ప్రజాప్రతినిధులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అభివృద్ధి అనేదే లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పి బీజేపీని గెలిపించాలన్నారు. సమస్యల పరిష్కారంపై ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాపయ్యగౌడ్, ప్రేమ్‌రాజ్‌యాదవ్, అనంతయ్యగౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, మాధవచారి, సుదర్శన్‌యాదవ్, శ్రవణ్, శ్రీనివాస్, మోహన్‌నాయక్, శంకర్, పరమేశ్, పంతునాయక్, కృష్ణానాయక్, హన్మంతు, నాగరాజు, జంగయ్య పాల్గొన్నారు.



గ్యారెంటీలను అమలు చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

విద్యారంగంపై ప్రభుత్వానికి పట్టింపేది?

వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మాత్రం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీష్‌రావు విమర్శించారు. పట్టణంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయక పోవడంతో ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలు విద్యార్థులపై భారం మోపుతున్నాయని ఆయన ఆరోపించారు. సర్టిఫికేట్లు ఇవ్వక కళాశాలలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సమస్యలు పరిష్కరించక పోతే ఏబీవీపీ ఉద్యమాలకు దిగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ నరేష్ కుమార్, మహేష్, సాయి కార్తీక్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

మోమిన్‌పేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. మోమిన్‌పేట్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మోమిన్‌పేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మోమిన్‌పేట్ సొసైటీ చైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. టేకులపల్లి జెడ్పీ పాఠశాలలో సోమవారం 69వ కబడ్డీ పోటీలు ప్రారంభించారు. పోటీల్లో మూడు మండాలకు చెందిన 55 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నిత్యానంద్‌ను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘట్‌కేసర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ నూతన కమిషనర్ నిత్యనంద్‌ను సోమవారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి, బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, నల్లవెల్లి శేఖర్, శ్రీనివాస్, అక్రం అలీ, కాశయ్య, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

పరిగి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పరిగిలో అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పరిగిలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అనిల్, సత్తయ్య, రఘురాం పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

తలకొండపల్లి/మహేశ్వరం/నందిగామ/యాచారం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి తహసీల్దార్‌గా రమేశ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొందుర్గు నుంచి ఆయన బదిలీపై తలకొండపల్లికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ నాగార్జున ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయ్యారు. ఆయన స్థానంలో రమేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు రమేశ్‌ను సన్మానించి అభినందించారు. మహేశ్వరం తహసీల్దార్‌గా చిన్న అప్పలనాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మహేశ్వరం తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సైదులు బదిలీపై నందిగామ మండలానికి వెళ్లడంతో ఆయన స్థానంలో అప్పలనాయుడు బాధ్యతలు చేపట్టారు. అలాగే నందిగామ తహసీల్దార్‌గా సైదులు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రాజేశ్వర్ రంగారెడ్డి కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు.

యాచారం ట్రాన్స్‌కో ఏఈగా సుధీర్

యాచారం ట్రాన్స్‌కో ఏఈగా సుధీర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన నల్గొండ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తానని పేర్కొన్నారు. ఇక్కడ పని చేసిన సందీప్‌కుమార్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.



షాబాద్: మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్



ఇబ్రహీంపట్నం: బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



కేశంపేట: బీజేవైఎం ఆధ్వర్యంలో..

మట్టి వినాయకులనే పూజిద్దాం

షాబాద్/ఇబ్రహీంపట్నం/కేశంపేట/కొందుర్గు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని షాబాద్‌లో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, ఇబ్రహీంపట్నంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ బూడిద రామ్‌రెడ్డి, కేశంపేటలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మల్లాంకర్ శివాజీ, కొందుర్గులో మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ అన్నారు. సోమవారం ఆయా చోట్ల స్థానిక ప్రముఖులతో కలిసి ప్రజలకు వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రసాయనాలతో కూడిన విగ్రహాలు పర్యావరణానికి హాని కల్గిస్తాయని పేర్కొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

చౌదరిగూడ/ఆమనగల్లు: వినాయక చవితిని పురస్కరించుకొని మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి తీసుకోవాలని చౌదరిగూడ, ఆమనగల్లు ఎస్సైలు విజయ్, వెంకటేశ్ సోమవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, కొత్త వ్యక్తులు ఏవరైనా కనిపిస్తే డయల్ 100ని సంప్రదించాలని పేర్కొన్నారు. వినాయక నిమజ్జనంలో డీజేలను ఏర్పాటు చేయకూడదని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించొద్దని కోరారు.

నేడు మట్టి విగ్రహాల పంపిణీ

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని గంపలక్ష్మమ్మచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్లు ట్రస్ట్ చైర్మన్, డీసీసీ డైరెక్టర్ గంప వెంకటేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కడ్తాల పాల శీతలీకరణ కేంద్రం ఎదుట వెయ్యి మట్టి గణపతుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కడ్తాల మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కొందుర్గు: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న నాయకులు

క్రైం కార్నర్

చెరువులో పడి బాలుడి మృతి



ఉమైర్(ఫైల్)

ఆదిభట్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం నాదర్గుల్ అశోక్‌రెడ్డి కాలనీలో నివాసం ఉండే మహమ్మద్ అజ్మత్, ఆయేషా దంపతుల కుమారుడు మహమ్మద్ ఉమైర్(6) సైకిల్‌తో ఆడుకుంటూ ఆడుకుంటూ పక్కనే సున్నం చెరువు వైపు వెళ్లాడు. బాలుడు కనిపించకపోవడంతో 100కు డయల్ చేయగా సమాచారం అందుకున్న పోలీసులు సున్నం చెరువు వద్దకు చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో చెరువులో గాలించగా బాలుడి మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆసుపత్రికి తరలించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కకాటుతో చిన్నారికి గాయాలు



కొందుర్గు,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కుక్కకాటుతో ఓ చిన్నారికి గాయాలైన ఘటన సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన పెరుమాళ్ల శ్రీను కుమార్తె చిన్నారి ఇంటిముందు ఆడుకుంటున్న సమయంలో కుక్క స్వైరా వీహారం చేసి చిన్నారి కాలుకు, చెతిపై కరవడంతో గాయాలయ్యాయి. చిన్నారి వెంటనే చికిత్స నిమిత్త ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి చికిత్స అందించారు. చిన్నారిని మేరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

శంకర్‌పల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలం ఏట్ల ఎర్రవల్లి గ్రామానికి చెందిన కుంటి ప్రశాంత్(25) నాలుగేళ్ల క్రితం మూడేళ్ల క్రితం శంకర్‌పల్లి మండలం గోపులారం గ్రామానికి చెందిన కుంటి మ హేశ్వరిని వివాహం చేసుకొని ఇల్లరికం వచ్చాడు. వీరికి 10 నెలల బాబు ఉన్నాడు. కాగా ప్రశాంత్ మెడికల్ దుకాణంలో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రశాంత్ తా గుడుకు బానిసయ్యాడు. సోమవారం సాయత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం



బాలయ్య(ఫైల్)

శంషాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడు అదృశ్యమైన సంఘట శంషాబాద్‌లో చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలానికి చెందిన బాలయ్య ఈ నెల 22న శంషాబాద్ బస్టాండ్ వద్ద తప్పిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఎవరైనా గుర్తిస్తే 9491053295కు సమాచారం అందించాలని కోరారు.

తండ్రి చావుకు కారకుడైన కొడుకు రిమాండ్

మొయినాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తండ్రి చావుకు కారణమైన కొడుకును పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజగూడ గ్రామానికి చెందిన మహమ్మద్ అజ్జుఖాన్(50) కూలి పని చేసేవాడు. ఈనెల 6న అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వద్ద డబ్బులు తీసుకొని పనికి ఎందుకు రాలేదని అజ్జుఖాన్ ను అడిగాడు. అదే విషయమై అజ్జుఖాన్ భార్య కూడా ప్రశ్నించింది. ఆ సమయంలో కొడుకు అహ్మద్ అజీమ్‌ఖాన్ అక్కడికి వచ్చాడు. డబ్బులు తీసుకొని మద్యం తాగి పనికి వెళ్లకుండా గొడవలు పడుతున్నాడని తండ్రిపై ఆగ్రహంతో కట్టెతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలైన అజ్జుఖాన్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 14న మృతి చెందాడు ఈ విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం నిందితుడు అజీమ్‌ఖాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

శుద్ధ జలమే లక్ష్యం!

(ఐదో పేజీ తరువాయి)

హోటళ్లు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. వీటినుంచి మురుగు ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అలాగే కొత్వాల్‌గూడ, కవ్వగూడ, శంషాబాద్, అజీజ్‌నగర్, శంకర్‌పల్లి, మొయినాబాద్, జన్వాడ, మీర్జాగూడ, మియాఖాన్‌గడ్డ తదితర ప్రాంతాల్లో భారీ సంఖ్యలో కాలనీలు, బస్తీలు వెలుస్తున్నాయి. ఇక్కడి నుంచి వచ్చే మురుగు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లో చేరుతోంది. దీన్ని అరికట్టకపోతే భవిష్యత్‌లో జలాశయ ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున ఎస్టీపీల నిర్మాణం చేపట్టాలని జల మండలి నిర్ణయించింది. నగరంలోని మణికొండ, సన్‌సిటీలోని పలు ప్రాంతాలకు ప్రతినిత్యం ఉస్మాన్‌సాగర్ నుంచి 97 మిలియన్ లీటర్లు, హిమాయత్‌సాగర్ నుంచి 36 మిలియన్ లీటర్లు నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. జలాశయాల్లోకి మురుగు చేరకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఈసీ, మూసీ పరివాహక ప్రాంతాల్లో మురుగు నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సుమారు రూ.82.23 కోట్లతో కొత్వాల్‌గూడ వద్ద 6 ఎంఎల్‌డీ, నాగిరెడ్డిగూడ వద్ద 5 ఎంఎల్‌డీ, హిమాయత్‌నగర్ వద్ద 5 ఎంఎల్‌డీ, జన్వాడ వద్ద 4 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఎస్టీపీలను నిర్మించాలని నిర్ణయించింది. మన్నెగూడ వద్ద మరో ఎస్టీపీని నిర్మించనున్నారు. వచ్చే ఏడాది మార్చి వరకు నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో దాదాపు నాలుగు సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని జన్వాడ, నాగిరెడ్డిగూడ, హిమాయత్‌నగర్, జన్వాడ ప్రాంతాల్లో మురుగు నీటి శుద్ధి కేంద్ర నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

అట్టహాసంగా జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు





కడ్తాలలో కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, ఆమనగల్లులో బీఆర్ఎస్ నేతల సంబురాలు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ నేతలతో కలిసి జైపాల్ యాదవ్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కడ్తాలలో భారీ ర్యాలీ నిర్వహించారు. జైపాల్ యాదవ్‌ను నేతలు సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచారు. జైపాల్ యాదవ్‌కు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కడ్తాలలో ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు, అంబేద్కర్ సంఘాల అధ్యక్షుడు సిద్దిగారిదాసు తన అనుచ రులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాలలో బీఆర్ఎస్ నాయకులు గంప వెంకటేశ్, సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తి బాలస్వామి, పత్యనాయక్, ఉప్పల వెంకటేశ్, విజితారెడ్డి, దశరథ నాయక్, కంబాల పరమేశ్, అర్జున్ రావు, శంకర్, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, నిర్మలాశ్రీశైలం గౌడ్, గోపాల్, నర్సింహ, సయ్యద్ ఖలీల్, చంద్రశేఖర్‌రెడ్డి, సేవ్యానాయక్, రంగయ్య, అంజి, కృష్ణ, మహేశ్, లాయక్‌అలీ, సాయి, సుభాష్, శ్రీనునాయక్, రమేశ్ నాయక్, వస్పుల సాయిలు, సైదులుగౌడ్, పంతూనాయక్, శివకుమార్, ప్రసాద్, రమేశ్, వెంకటేశ్, మహేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టించొద్దు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చ నాయకుడు నాగార్జున రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కాల లక్ష్మణ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోరటి నర్సింహ ఆరోపించారు. యూరియా కొరతను తీర్చాలని కోరుతూ ఆమనగల్లు పట్టణంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించి డీటీ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే కడ్తాల మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో సకాలంలో యూరియా పంపిణీ చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్యకు వినతిపత్రం అందజేశారు. తలకొండపల్లి మండల కేంద్రంలో యూరియా కొరతను తీర్చాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇదేం నిర్లక్ష్యం..!

(ఐదో పేజీ తరువాయి)

చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. కప్పపహాడ్ నుంచి తులేకలాన్ గ్రామానికి వెళ్లే రోడ్డులో, తుర్కగూడ గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లతో ప్రమాదం పొంచి ఉంది. కప్పపహాడ్ గ్రామంలో జంగిలిస్వామి, చేతాల్ల మహంకాళి, యాదయ్య ఇళ్లపై నుంచి 11కేవీ వైర్లు, 10వ వార్డులో గుడాల భిక్షపతి ఇంటిపై నుంచి వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ వైర్లతో పెను ప్రమాదం పొంచి ఉంది. పోల్కంపల్లి గ్రామంలోని ఎస్సీ బస్తీలోని ఈట మల్లయ్య, పెద్దముత్తని బాలయ్య, ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్ వైర్లు, ఎన్గాల్‌గూడ చెరువు కట్టపై ఉన్న ట్రాన్స్‌పార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించి, జనవాసాలకు దూరంగా ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు మార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇటీవల పోల్కంపల్లి, దండుమైలారంలో విద్యుత్ షాక్ తగలడంతో మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి.

జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలి

విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేశారు. దీంతో ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన తక్కువ ఎత్తులో రోడ్డుకు ఆనుకొని ఉన్న ట్రాన్స్‌పార్మర్లు, ఇళ్లపై నుంచి ఉన్న కరెంటు తీగలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ట్రాన్స్‌పార్మర్లను జనవాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలి. వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

- పి.జగన్, పోల్కంపల్లి గ్రామస్తుడు

వ్యసనాలకు బానిస కావొద్దు

కేశంపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దని కేశంపేట సీఐ నరహరి అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు యాంటీ డ్రగ్, ర్యాగింగ్, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. ఎస్ఐ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎండీ అసిపుద్దీన్, అధ్యాపకులు నారాయణ, లక్ష్మీరాజు, ధృవకుమార్, రాణి, మల్లేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మార్వాడీల పాదయాత్ర



కొత్తూర్: మార్వాడీల అరాధ్య దైవం రాందేవ్ బాబా జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక మార్వాడీ సంఘ్ రాందేవ్ సేవా సమితి అధ్యక్షుడు అరవింద్‌మిర్జా ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. రాందేవ్ బాబా రథాన్ని మేళతాళాల మధ్య యువతీ, యువకులు నృత్యాలు చేసుకుంటూ ఊరేగించారు. హైదరాబాద్‌లోని శివరాంపల్లిలోని రాందేవ్‌బాబా ఆలయం వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కొత్తూర్‌లో అన్నదానం చేశారు. నిర్మల్, డేదిచ్, సజ్జల, హీరాలాల్, బన్వర్‌లాల్, మనోజ్, పవన్, కలరం, పూఖారాజ్, దినేష్, జానీ, హనుమాన్, ములారం, రమాకంత్, సర్వనాశ్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

కందుకూరు: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. మండలంలోని పులిమామిడి గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.9 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు అనేగొని పాండుగౌడ్, బుక్క పాండురంగారెడ్డి, ఎం.రమేష్, బి.నరేందర్ రెడ్డి, జి.మల్లయ్య, పి.రవీందర్, బుక్క మహేందర్ రెడ్డి, జి.పాండురంగాచారి, పి.యాదయ్య, పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

శంకర్‌పల్లి: సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని శంకర్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలకృష్ణ సూచించారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఫీవర్ సర్వేపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలతో డెంగీ, మలేరియా, బోధకాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, నీళ్ల నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. మండల పంచాయతీ అధికారి గిరిరాజ్, వైద్యాధికారులు రేవతి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

యాచారం: మండలంలోని వివిధ గ్రామాల్లో

సంక్షిప్తంగా..

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్లు, ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాధారాణి, ఎంపీవో శ్రీలత అన్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. వన మహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటాన్నారు. సమావేశంలో ఏపీవో లింగయ్య, ఇసీ శివశంకర్‌రెడ్డిలున్నారు.

నిరక్షరాస్యత నిర్మూళనకు కృషి చేయాలి



మంచాల: నిరక్షరాస్యత నిర్మూళనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ విజ్ఞప్తి చేశారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామ సంఘాల మహిళలు సోమవారం పాఠశాలలో అక్షరవికాసం మార్గదర్శి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్, శ్రీకాంత్, సీఆర్‌పీ గిరీష్, పేరెంట్ కమిటీ సభ్యులు భాస్కర్, డీఆర్‌పీ యాదయ్య, శివ, వీవోఏలు జ్యోతి, జహీర్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

శంకర్‌పల్లి: మండల వ్యవసాయ అధికారి చైతన్య రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేశారు. మండలానికి 1,132 (50.94 మెట్రిక్ టన్నులు) బస్తాల యూరియా రాగా, ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశారు. మంగళవారం మరో 20మెట్రిక్ టన్నుల యూరియా రానున్నదని తెలిపారు. ఇప్పటివరకు మండలానికి సూమారుగా 600మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని వెల్లడించారు. మండలంలో యూరియా కొరత లేదని స్పష్టం చేశారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

చౌదరిగూడ/కొందుర్గు/మాడ్గుల: రైతులకు ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందిస్తుందని వ్యవసాయాధికారులు రాజేందర్ రెడ్డి, సురేష్‌రెడ్డి, అరుణకుమారి తెలిపారు. రైతులకు అవసరమైన కేజ్‌వీల్స్, రోటవేటర్, కల్టివేటర్, బ్యాటరీ పవర్‌పంప్‌లు, విత్తనాలు వేసే వీల్స్ అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం చిన్న, సన్నాకారు, ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50శాతం సబ్సిడీతో పరికారాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తుతోపాటు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ఫొటోను జతపరిచి మండల వ్యవసాయాధికారులకు అందజేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కొందుర్గు: డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రవీందర్ నాయక్ అన్నారు. కొందుర్గులో సోమవారం ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసి చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్క్ చేయొద్దన్నారు.

నేటి నుంచి జీవాలకు వ్యాక్సినేషన్

కడ్తాల్/కొత్తూర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు కడ్తాల మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేయనున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ భానునాయక్ అన్నారు. అలాగే 26, 27న ముద్విన్, చల్లంపల్లి, రావిచెడ్, కడ్తాల్, కర్కల్‌పహాడ్, 28, 29, 30 తేదీల్లో చరికొండ, చల్లంపల్లి, సాలార్‌పూర్, రావిచెడ్, న్యామతాపూర్, కడ్తాల్, కర్కల్‌పహాడ్, వాసుదేవ్‌పూర్‌లో, 31న ముద్విన్, వంపుగూడ, నాగిరెడ్డిగూడ, కడ్తాల్, సెప్టెంబర్ 1, 2న ముద్విన్, వంపుగూడ, టాక్‌రాజ్‌గూడ, మక్తమాదారం, కడ్తాల్, వాసుదేవ్‌పూర్, 3, 4, 5న ముద్విన్, చల్లంపల్లి, రావిచెడ్, కడ్తాల్, కర్కల్‌పహాడ్, 6, 7న చరికొండ, సాలార్‌పూర్, న్యామతాపూర్, కడ్తాల్, కర్కల్‌పహాడ్, వాసుదేవ్‌పూర్ గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే కొత్తూరు పరిధిలో జీవాలకు వ్యాక్సీనేషన్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక పశువైద్యధికారి డాక్టర్ స్ఫూర్తి తెలిపారు. ఈ నెల 26, 28 తేదీల్లో ఇన్ముల్‌నర్వ, 29, 30న ఎస్‌బీపల్లి, సెప్టెంబర్ 1, 2న కొడిచర్ల, 3, 4న పెంజర్ల, 5న కొత్తూర్, కొత్తూర్‌తండా 6న మక్తగూడ, 8న మల్లాపూర్, మల్లాపూర్‌తండా, 9, 10న తీగాపూర్, 11న కుమ్మరిగూడ, 12న స్టేషన్ తిమ్మాపూర్, 13న సిద్దాపూర్, 14న సిద్దాపూర్‌తండాల్లో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

(ఐదో పేజీ తరువాయి)

స్టేటస్‌కో ఉన్న పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. 22 సర్వే నెంబర్లలో 12 ఎకరాల భూమి పట్టాదారు ఉమర్‌బిన్ సయ్యద్ ద్వారా 1988సంవత్సరంలో పద్మ జంగయ్య, చంద్రయ్యలకు గిఫ్ట్‌డీడ్ ద్వారా భూమి వచ్చిందని భూ బాధితులు తెలిపారు. తమ సొంత భూమిపైకి వెళ్తే సుప్రీం కన్‌స్ట్రక్షన్ వారు దాడికి పాల్పడుతున్నారని, బెదిరింపులకు గురి చేస్తున్నారని, ఫోన్ ద్వారా చంపేస్తామని వార్నింగ్ ఇస్తున్నారని భూ బాధితులు ఆరోపించారు. ఫరూక్‌నగర్ తహసీల్దారు స్టేటస్‌కో విధిస్తూ అక్కడ నోటీసులు అతికించారని, వాటిని ఈ రోజు తొలగించి సుప్రీం కన్‌స్ట్రక్షన్ వారు యథేచ్ఛగా పనులు మళ్లీ ప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. హియరింగ్ నడుస్తుండగా కబ్జాదారులకు, రిజిస్ట్రేషన్, కన్‌స్ట్రక్షన్‌కు అనుమతులు ఎలా వచ్చాయని బాధితులు ప్రశించారు. అధికారులు, కబ్జాదారులు కుమ్మక్కైనట్లు ఆరోపించారు.

సమస్యల పరిష్కారానికి జంగ్ సైరన్..

ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారుల, కార్మిక అండ్ పెన్షనర్ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జంగ్ సైరన్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ డాక్టర్ కె.రామారావు తెలిపారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ, జిల్లా సన్నాహక సమావేశాన్ని సోమవారం కొంగరకలాన్‌లో నిర్వహించారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం, సెప్టెంబరు 15న జిల్లా బస్సు యాత్ర, అక్టోబర్ 12న టీజీఈజేఏసీ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి జేఏసీ ప్రతినిధులు కార్యాచరణ నోటీస్‌ను అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనేష్ కుమార్ నోరి, ఎశ్వంత్, వెంకటేష్, నూతకంటి వెంకట్, శాంతి, రంగయ్య, అనిత, మహేశ్, ఈశ్వర్, బాలరాజ్, లక్ష్మణ స్వామి, అలివేలు, శ్రీను, రేవతి, సుజాత, సైదమ్మ, సుధాకర్ రాకేష్ తదితరులున్నారు.

పారితోషికాలు తగ్గించొద్దు

ఆశా వర్కర్లు పనిచేయడం లేదని, పారితోషికాలు తగ్గించాలనే వ్యతిరేక విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ జి. కవిత డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం పెంచిన పారితోషికాల చెల్లింపు, ఫిక్సిడ్ వేతనం రూ.18 వేలు, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు.

గృహ ప్రవేశాలకు అనుమతివ్వాలి

గృహ ప్రవేశాలకు అనుమతి ఇవ్వాలని మహేశ్వరం నియోజకవర్గం మహంకాల్‌లోని డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. గత ప్రభుత్వం లాటరీ ద్వారా ఎంపికైన 131 మంది లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించిందని, భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు జె.శేషు తెలిపారు. త్వరగా గృహ ప్రవేశాలను కల్పించాలని డిమాండ్ చేశారు.



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న భీంభరత్

సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు25(ఆంధ్యజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సంబురాల్లో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, నాయకులు బొక్క బాలకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, బొలిగిద్ద సత్యనారాయణ పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో మార్కెట్ ఏర్పాటు చేయాలి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు25(ఆంధ్యజ్యోతి): నగర శివారు మొయినాబాద్‌లో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ జంగయ్య అన్నారు. మొయినాబాద్‌లో మేకల మండీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సోమవారం వారు మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కొత్త జైపాల్‌రెడ్డి, పాటి శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, శ్రీరాంరెడ్డి, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇనాం భూములు కాజేశారు.. ఆదుకోండి

యాచారం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తమ ఇనాం భూములు ఓఆర్‌సీ తెచ్చుకొని కాజేశారని, తమకు న్యాయం చేయాలని యాచారం మండలం చిన్నతూండ్ల గ్రామానికి చెందిన దళితులు సోమవారం తహసీల్దారు అయ్యప్ప, డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్‌కు ఫిర్యాదు చేశారు. 266 సర్వే నంబర్‌లోని ఐదున్నర ఎకరాలను కొందరు వ్యక్తులు ఇతరులకు ఓఆర్‌సీ ఇప్పించి కాజేశారని అధికారులకు వివరించారు. దళితులు కాని వ్యక్తుల పేరిట భూమి రికార్డులున్నట్లు చెప్పారు. గ్రామంలో సమగ్రంగా విచారణ చేసి న్యాయం చేయాలని దళిత రైతులు సంజీవ, ఈశ్వర్, యాదయ్య తదితరులు కోరారు. దీనిపై సమగ్రంగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులకు చెప్పారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఏకం కావాలి

షాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం దిశగా బీసీలు ఏకం కావాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా షాబాద్ నుంచి భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించాలనే లక్ష్యంతో జరుగుతున్న సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీను, మండల అధ్యక్షుడు దయాకర్‌చారి, ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, యూత్ అధ్యక్షుడు బండ అజయ్‌కుమార్, నాయకులు మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లింగం పాల్గొన్నారు.